సాక్షి
కామారెడ్డి
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024





కామారెడ్డి పట్టణంలో వినాయకుల నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

గంగమ్మ చెంతకు గణపయ్య

- జిల్లాలో ఘనంగా నిమజ్జనం
- కనుల పండువగా సాగిన శోభాయాత్ర
- వీక్షించడానికి తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న భారీ విగ్రహాలు
- నృత్యాలతో హోరెత్తించిన యువత



మద్నూర్ చెరువులో వినాయకుడి నిమజ్జనం



బిచ్కుందలో భజన చేస్తున్న వార్కరీలు

కామారెడ్డి టౌన్: నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడు మంగళవారం గంగమ్మ చెంతకు చేరాడు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో సోమవారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. సుమారు 400లకు పైగానే వినాయక విగ్రహాలతో ఈ శోభాయాత్ర సాగింది. ఇందిరాచౌక్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణపతి విగ్రహాలకు ఘన స్వాగతం పలికారు. మండపాల నిర్వాహకులకు వీహెచ్‌పీ ప్రతినిధులు సన్మానించారు. డప్పులు, నాసిక్‌డోల్, బ్యాండ్, డోల్ చప్పుల మధ్య యువకులు నృత్యాలతో శోభాయాత్ర సాగింది. టేక్రియాల్ చెరువులో వినాయకులను నిమజ్జనం చేసేందుకు నాలుగు బారీ క్రేయిన్‌లను, ఒక డోజర్‌ను వినియోగించారు. చెరువు వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న విగ్రహాలు

కామారెడ్డిలో ప్రతిష్ఠించిన విభిన్న రూపాల వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి. శోభాయాత్రను తిలకించడానికి ప్రజలు తరలివచ్చారు. రోడ్లన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి. పెద్ద విగ్రహాలు విద్యుత్, టెలిఫోన్, బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్‌నెట్, డిష్ వైర్లకు తాకడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



మద్నూర్‌లో ఎడ్లబండిపై నిమజ్జనానికి..



మద్నూర్‌లో డ్యాన్స్ చేస్తున్న బాలికలు



కామారెడ్డిలో నృత్యం చేస్తున్న యువకులు

శోభాయాత్రలో ఉద్రిక్తత



కామారెడ్డిలోని పాంచ్ రాస్తా వద్ద నిమజ్జన శోభాయాత్రలో మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ట్రాక్టర్ ముందు డోల్ వాయిస్తున్న వారిని పోలీసులు బలవంతంగా పంపడంతో గొడవకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పోలీసులు స్వల్పంగా లాటిఛార్జ్ చేశారు. వినాయకుడితో ఉన్న వాహనాన్ని బలవంతంగా తరలించారు. దీంతో నిర్వాహకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వీహెచ్‌పీ, మండపాల నిర్వాహకులు భారీగా చేరుకున్నారు. రెండు గంటల పాటు ఆందోళన సాగింది. చివరకు పోలీసులు క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

భారీ బందోబస్తు

శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సింధుశర్మ పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సైతం శోభాయాత్ర విజయవంతం కోసం కృషి చేశారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ముందస్తుగా ఆంక్షలు విధించి వాహనాలను దారి మళ్లించారు. అయితే వినాయక వాహనాలను, బ్యాండ్ కొట్టేవారిని త్వరగా వెళ్లాలని పోలీసులు తోసివేయడంతో వాగ్వాదం చోటు చేసుకుంది.



కామారెడ్డిలో..



బాన్సువాడలో నృత్యం చేస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

ఘనంగా విశ్వకర్మ జయంతి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఇందుప్రియ, బీసీ సంక్షేమ అధికారి చందర్, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న హెచ్‌బీటీ(హావర్స్ బేస్డ్ టీచర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్‌కు సంబంధించి తెలుగు, ఇంగ్లిష్‌–2, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, కామర్స్ పోస్టులు, టీజీటీ(ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)కి సంబంధించి హిందీ, మ్యాథ్స్, సోషల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ పూర్తిచేసి ఉండాలని, టీజీటీ పోస్టులకు డిగ్రీతో పాటు, బీఈడీ పూర్తిచేసి ఉండాలన్నారు. వీటితో పాటు టెట్ క్వాలిఫై అయిన వారు అర్హులని వివరించారు. ఆసక్తి గలవారు ఈ నెల 21లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 23న ఉదయం 10గంటలకు డెమో క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు.

జీవాలకు టీకాలు వేయించాలి

కామారెడ్డి అర్బన్: గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని, దీని కోసం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్ తెలిపారు. టీకాలు వేసి జీవాల సంఖ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే దాదాపు 3.50 లక్షల గొర్రెలు, మేకలకు టీకాలు వేశామని, పెంపకందారులు సహకరించి మిగతా జీవాలకు టీకాలు వేయించుకోవాలని కోరారు. జీవాల యాజమానులు తమ వివరాలను 'భారత్ పశుధన్' యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా జీవాల సంఖ్యకు అనుగుణంగా వ్యాక్సిన్ సరఫరా, మాంసం ఉత్పత్తి, జీవాల రక్షణ, ప్రభుత్వం తీసుకునే అభివృద్ధి చర్యలకు ఆస్కారం ఉంటుందన్నారు.

అందుబాటులోకి బ్యాడ్మింటన్ కోర్టు

బాన్సువాడ రూరల్: బాన్సువాడలోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోర్టు అందుబాటులోకి తెచ్చినట్లు క్రీడాకారుడు నరేష్ తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు తీసుకుని మినీ స్టేడియంలో సంప్రదించాలన్నారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రత్యేక కోచ్ పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



బాన్సువాడ: పట్టణంలో ప్రైవేటు ఆస్పత్రులను మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. నిబంధనలకు లోబడి ఆస్పత్రుల నిర్వహణ ఉండాలని సూచించారు. ఆమె వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దయానంద్ ఉన్నారు.

'గుత్ప' నీటి విడుదల

నందిపేట్(ఆర్మూర్): అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల నీటిని మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి.. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న మొదటి పంపుహౌస్ వద్ద వారు స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుత్ప లిఫ్ట్ ద్వారా ఆర్మూర్, నందిపేట, మాక్లూర్, ఆలూర్, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాల రైతులకు చెందిన సుమారు 34,650 ఎకరాలకు నీటిని అందిస్తామన్నారు. చివరి ఆయకట్టుకు నీరందే వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం 545 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, అవసరం మేరకు పెంచుతామన్నారు. భూతం సాయారెడ్డి, ధాత్రిక రాజు, చిన్నయ్య పాల్గొన్నారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న పటేల్ రమేశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

సాయుధ పోరాటంతోనే రాచరికం నుంచి విముక్తి

- సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర పురోభివృద్ధి
- అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి సాధిస్తోంది
- ప్రజాపాలన దినోత్సవంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన, రాచరికం నుంచి తెలంగాణకు విముక్తి లభించిందని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. నిజాం పాలనలో నెలకొన్న వెట్టి చాకిరి, మతపరమైన నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఎంతోమంది పోరాడారని గుర్తు చేశారు. నాడు భారత ప్రభుత్వ సైనిక చర్యతో 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ దేశంలో వీలినమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల ను అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ, అటవీ అధికారి నిఖిత, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ నియోజక వర్గంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మిస్తామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా జిల్లాలో 7,911 మందికి చికిత్స పొందారని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పాల్వంచ మండలం ఇసాయిపేట, రామారెడ్డి మండలం రెడ్డిపేట ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులను సత్కరించారు.



మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

గృహజ్యోతితో వెలుగులు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. జిల్లాలో 3.54 కోట్ల మంది ఉచితంగా ప్రయాణించారని, రూ.69.98 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. గృహజ్యోతి ద్వారా 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,56,670 కుటుంబాలకు జీరో బిల్లులు వచ్చాయని, వీటి ద్వారా ప్రభుత్వం రూ.4.84 కోట్లు సబ్సిడీ అందించినట్లు చెప్పారు.

రైతన్నలకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని టూరిజం కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అన్నారు. జిల్లాలో 91,259 మంది రైతులకు రూ.646.47 కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. మార్చిలో కురిసిన వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు 10,328 ఎకరాలకు రూ.10 వేల చొప్పున జమ చేశామని చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కేవీ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన రైతులందరికి ఎకరానికి రూ.15 వేల రైతుభరోసా ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పిస్తోందని, దీనికి సంబంధించి విధివిధానాలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.



రెడ్డిపేట ఉన్నత పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన

మహిళా శక్తితో చేయూత

మహాలక్ష్మి పథకం ద్వారా రూ.5వందలకు గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు రమేశ్‌రెడ్డి చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,43,899 మంది వినియోగదారులకు 2,97,121 సిలిండర్లను పంపిణీ చేశామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మైక్రో ఎంటర్‌ప్రైజెస్, కుట్టు కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థలు, క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్, పాడి గేదెలు, పెరటికోళ్ల పెంపకం, మిల్క్ పార్లర్లు, ఫుడ్ ప్రాసెస్ యూనిట్లు వంటి 14 అంశాల్లో మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు 10,413 మంది మహిళలకు రూ.118.59 కోట్లతో యూన్టిలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించగా, ఇప్పటి వరకు 3,891 యూనిట్లు గ్రౌండింగ్ జరిగాయన్నారు. దీనికోసం రూ.50.58 కోట్లు స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా అందించామన్నారు.



ఇసాయిపేట ఉన్నత పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన

జెండా ఎగుర వేసిన కలెక్టర్, ఎస్పీ



క్యాంప్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం/కామారెడ్డి రూరల్: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయాల్లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కలెక్టర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో కూడా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో చందర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద ఎస్పీ సింధుశర్మ

అమ్మ పేరిట ఓ మొక్క



ఎల్లారెడ్డి: ఏక్ పేడ్ మా కే నామ్(అమ్మ పేరిట ఓ మొక్క నాటడం) కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీశాఖ అధికారిణి నిఖిత, ఎఫ్‌డీవో రామకృష్ణ మంగళవారం ఎల్లారెడ్డి అటవీ ప్రాంతంలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరు అమ్మ పేరిట మొక్కలను నాటాలనే లక్ష్యంలో భాగంగా అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది వంద మొక్కలను నాటినట్లు డీఎఫ్‌వో తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఓంకార్, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాస్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాన్ని పరిశీలించిన కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి క్రైం: గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కామారెడ్డికి సమీపంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువు లోనికి ఎవరినీ అనుమతించొద్దన్నారు. క్రేన్ సహాయంతో విగ్రహాల నిమజ్జనాన్ని చేపట్టాలన్నారు. రాత్రి సమయంలో లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ సమైక్యత దినోత్సవాల్లో జిల్లా నేతలు



నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన జాతీయ సమైక్యతా దినోత్సవాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌తో పాటు జెడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్ రాజు, దాదన్నగారి విఠల్ పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం, జెండావిష్కరణ చేసిన అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు.

ఆపదలో ఆపన్నహస్తం ఎల్‌వోసీ



బాన్సువాడ రూరల్: ఆపదలో ఉన్న పేదవారికి ప్రభుత్వం అందించే ఎల్‌వోసీ ఆపన్నహస్తం వంటిదని కోనాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ వెంకట రమణరావు అన్నారు. కోనాపూర్ గ్రామానికి చెందిన రంగి కాశీరాం అనారోగ్యానికి గురై ఆపరేషన్ నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేరగా మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని లేకుంటే ఎదుటివారి లక్ష్యానికి బానిస కావాల్సి వస్తుందని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ రమేష్ చైతన్య అన్నారు. మంగళవారం ఆయన బస్వాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉంటే క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు జయదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బాన్సువాడ రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన దేశాయిపేట్ గ్రామంలో పర్యటించి పలుచోట్ల మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలన్నారు.పంచాయితీ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ శోభాయాత్రలో ఘర్షణ



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని గణేశ్ శోభాయాత్రలో ఘర్షణ చోటు చేసుకుంది. మంగళవారం నిర్వహించిన శోభాయాత్రలో రెండు గణేశ్ మండపాల నిర్వాహకులు రోడ్డుపై ముందుకు వెళ్లే విషయంలో వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించినా వినకపోవడంతో సీఐ పిట్లం, బిచ్కుంద ఎస్సైలతో ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. పలువురిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.



తిర్మన్‌పల్లిలో శోభాయాత్రకు తరలిన గణనాథుడు



మద్నూర్‌లో ..



లింగంపేటలో..



తిప్పాపూర్‌లో వినాయక విగ్రహదాత పద్మ చంద్రంను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నేతలు

లంబోదరా వెళ్లిరావయ్యా..!



పిట్లం గణేశ్ మండపాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

గణపతి బప్ప మోరియా.. ఆదా లడ్డూ కాలియా.. జైబోలో గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ జిల్లా వ్యాప్తంగా వీధులన్నీ మార్మోగాయి. వినాయక నిమజ్జనం సందర్భంగా మంగళవారం గణేశ్ విగ్రహాల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేశారు. లడ్డూల వేలం పాటలు నిర్వహించారు. చాలాచోట్ల శోభాయాత్రలో డీజేలకు అనుమతి ఇవ్వకపోవడంతో పలువురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహిస్తూ యువకులు నృత్యాలు చేశారు. స్థానికంగా ఉన్న చెరువులు, బావులలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చెరువులు, బావుల వద్ద అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. –సాక్షి నెట్‌వర్క్



పెద్ద ఏడ్గిలో రూ.1.41 లక్షలకు లడ్డూను దక్కించుకున్న అనిల్ దంపతులు



బాన్సువాడ టీచర్స్ కాలనీలో రూ.2.25 లక్షలకు కలశాన్ని దక్కించుకున్న పడిగెల శైలజ-ప్రకాష్ దంపతులు



తాడ్వాయి: శబరిమాత ఆశ్రమంలో పూజలు



సింగీతం రిజర్వాయర్‌లో గణేశ్ నిమజ్జనం



ఊరేగింపులో బాలుడి నృత్యం



బాన్సువాడలో వినాయకుడిని దర్శించుకున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



బీబీపేటలో..

ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

బాన్సువాడ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం బీర్కూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బీజేపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి యోగి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడి నిండునూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు బీరు గొండ, వెంకటేశ్, గజేందర్, బస్వరాజ్ ఉన్నారు.



బీర్కూర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

విద్యార్థులకు అభినందనలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందని ఎంఈవో యోసెఫ్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న కామారెడ్డిలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు జావెలిన్ త్రో అండర్–16 విభాగంలో సాత్విక, అండర్–14 విభాగంలో ఎస్.భవాని, ఎండీ ఆస్కాన్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల పీడీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు విశిష్టమైన గుర్తింపు

● రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సెప్టెంబర్ 17వ తేదీకి విశిష్టమైన గుర్తింపు ఉందని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రిజిస్ట్రార్ వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. 1947ఆగస్టు15న భారత దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో నిజాం నిరంకుశ పాలనకు సమాధి చేసి బానిస సంకెళ్ల నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి చేసిన రోజుగా 1948 సెప్టెంబర్ 17 చరిత్ర కెక్కిందన్నారు. ఈ క్రమంలో అనేకమంది అమరులయ్యారని, అమరుల త్యాగాలను స్మరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి, వైస్ ప్రిన్సిపాల్ ఎం సత్యనారాయణరెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కె రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

ఆర్మూర్ మున్సిపల్‌లో కౌన్సిలర్ వీరంగం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఓ కౌన్సిలర్ వీరంగం సృష్టించాడు. ట్రాలీ ఆటో అద్దాలను ధ్వంసం చేశాడు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా చైర్‌పర్సన్ పన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొత్త ట్రాలీలను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా అక్కడికి వచ్చిన 36వార్డు కౌన్సిలర్ చైర్‌పర్సన్‌తో, కమిషనర్‌తో వాగ్వాదం చేశాడు. తన వార్డుకు చెత్తను తరలించడానికి ఆటోను ఎందుకు పంపడం లేదని వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో కోపంతో నూతన ట్రాలీ ఆటో అద్దాలను ధ్వంసం చేయడంతో పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది భయందోళనకు గురయ్యారు. గతేడాది నుంచి 36వ వార్డులో చెత్త సేకరించే వాహనం రావడం లేదని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినాన పట్టించుకోవడం లేదన్నారు. ఆటో అద్దాల ధ్వంసంతో ఆటో ట్రాలీల ప్రారంభోత్సవం ఆగిపోయింది. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన కౌన్సిలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాజు అన్నారు.



ధ్వంసమైన ఆటో అద్దం

ఘనంగా అనంత చతుర్దశి వేడుకలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని అనంతపద్మనాభస్వామి ఆలయంలో అనంత చతుర్దశి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇతర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదానం



కామారెడ్డి టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార మాట్లాడుతూ.. విశ్వ గురువుగా భారత్‌ను నిలపడం కోసం 10 సంవత్సరాలుగా ప్రధాని ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నందివేణు, నాయకులు లక్ష్మారెడ్డి, భరత్, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీందర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: కొత్తాబాది తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కమల కిషోర్ తెలిపారు. పీజీటీ గణితం, ఎకనామిక్స్, సివిక్స్, ఇంగ్లీష్, జువాలజీ సబ్జెక్టులు బోధించడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే టీజీటీ ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధించడానికి హవర్లీ బేస్డ్ ప్రాతిపదికన నియామకాలు చేపడతామన్నారు. ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పాఠశాలలో నల్ల నాగు కలకలం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నల్ల నాగుపాము కలకలం సృష్టించింది. పాము పాఠశాల ఆవరణలోకి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు స్పందించి వెంటనే పామును చంపేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, పిచ్చి మొక్కలు పెరగడంతో పాఠశాల ఆవరణలోకి విషపురుగులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇందూరు తిరుపతి.. జెండా బాలాజీ



జెండా బాలాజీ మందిరం

- నేటితో ముగియనున్న ఉత్సవాలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు

నిజామాబాద్‌రూరల్/ నిజామాబాద్‌నాగారం: కలియుగదైవం.. వేంకటేశ్వర స్వామి కొలువైన ఇందూరు తిరుపతిగా పేరుగాంచింది జెండా బాలాజీ మందిరం. రెండు వందల ఏళ్లుగా భక్తులకు ఆధ్యాత్మికతను పంచుతోంది. ఏటా భాద్రపద మాసంలో పక్షం రోజుల పాటు జెండా బాలాజీ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ చరిత్ర, విశిష్టతపై ప్రత్యేక కథనం..

ఆలయ చరిత్ర..

తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలు నిజాం పాలనలో ఉన్న సమయంలో నాందేడ్ జిల్లా కందార్‌కు చెందిన తుకోజి స్వామి వారి భక్తుడు. ఏటా తిరుమలకు కాలనడకన వెళ్లి వచ్చే వారు. ఇలా 41 సార్లు వెళ్లారు. తీరా వృద్ధాప్యం వచ్చాక తిరుమల చేరుకున్నాక కొండలు ఎక్కలేనని తనకు దర్శనభాగ్యం కల్పించాలని స్వామిని వేడుకున్నారు. స్వామి వారు క్షేత్రాధికారికి కలలో కనిపించి తన ఉత్సవ విగ్రహాలను తుకోజికి ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఉత్సవమూర్తులతో ఇంటికి వెళ్తుండగా నిజామాబాద్‌లో రాత్రి బసచేశారు. ఆయన నిద్రించిన ప్రదేశంలోనే తన గుడి నిర్మించాలని స్వామివారు సిర్నపల్లి దేశ్‌ముఖ్‌ను ఆదేశించగా 1858లో ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి దీనిని జెండా బాలాజీ మందిరంగా పేరు పొందింది. దాత సర్వాగౌడ్ నేతృత్వంలో 1930లో ఆలయాన్ని మరింత అభివృద్ధిపర్చారని చరిత్రకారులు చెబుతున్నారు.

విజయవంతం చేయాలి

జిల్లా కేంద్రంలో నిర్వహించే జెండా జాతరకు ప్రత్యేక చరిత్ర ఉంది. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు ముగింపు సందర్భంగా జెండా ఊరేగింపు ఉంటుంది. స్వామివారి జెండా ముందుండగా ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా ఫులాంగ్ బ్రిడ్జి వరకు తరలివెళ్లి వెళ్ళి విశ్రాంతి విడిది చేయడంతో ఉత్సవ కార్యక్రమాలు ముగుస్తాయి. జెండా జాతరను భక్తులు విజయవంతం చేయాలి.

– విజయ రామారావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్

జెండా మోసేది ఆర్మూర్ బక్కన్న కుటుంబీకులే..

బాలాజీ జెండాను మోసే బాధ్యత, ఉత్సవాల నిర్వహణ తమకు తరతరాలు వస్తున్న వార సత్వ సంపద అని ఆర్మూర్ బక్కన్న కుటుంబీకు లు ఆర్మూర్ సుదర్శన్, ఆర్మూర్ రత్నాకర్, రమేశ్, సురేశ్, శ్రీనివాస్, కరుణాకర్ తెలిపారు. మా పూర్వీకులు ఆర్మూర్ బక్క న్న, అతని అన్నదమ్ముళ్లు జెండా బాలాజీ ఉత్సవాలను ప్రతి ఏడాది 11 రోజుల పాటు నిర్వహించే వారని తెలిపారు. స్వామి వారి జెండా మోసే బాధ్యత, ఉత్సవాల నిర్వహణ మా పూర్వీకుల నుంచి మా తాతలకు, మా తాతల నుంచి మా తండ్రులకు, మా తండ్రుల నుంచి మా పిల్లలకు జాతరాల నిర్వహణ మా ఆధ్వర్యంలోనే కొనసాగడం మా అదృష్టం భావిస్తున్నా మని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో భక్తులు కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకం ఎంతో ఉంది. అందుకనే ఆలయానికి తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.



ఆర్మూర్ వంశస్తులు జెండాను మోస్తున్న దృశ్యం(ఫైల్)

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో భార్య హత్య

వర్ని: కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన ఘటన వర్ని మండలంలోని వడ్డేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలయ్య, పెంటవ్వ(46) భార్యాభర్తలు. కొన్ని రోజులుగా ఇంట్లో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి సైతం వీరి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో మద్యం మత్తులో ఉన్న బాలయ్య ఇంట్లో ఉన్న కొడవలితో పెంటవ్వపై ఇష్టానుసారంగా మెడ, చాతిపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సకాలంలో వైద్యం అందక దూడ మృతి



భిక్కనూరు: అస్వస్థతకు గురైన ఆవు దూడకు సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బండమీది బాల్‌రాజు ఆవు దూడ మంగళవారం అస్వస్థతకు గురికావడంతో గ్రామంలో ఉన్న పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో పశువైద్య సిబ్బందికి ఫోన్ చేయగా వారు స్పందించలేదు. కొద్ది సేపటికి దూడ మృతి చెందింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన ఆవు దూడ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరాడు.

చోరీకి పాల్పడిన నిందితుడి పట్టివేత

● చెట్టుకు కట్టేసి చితకబాదిన స్థానికులు

భిక్కనూరు: చోరీకి పాల్పడిన ఓ నిందితుడిని స్థానికులు పట్టుకొని, చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తక్కనోళ్ల కోరె బీరయ్య మంగళవారం ఉదయం గంజ్ ప్రాంతంలో నిలిపి ఉన్న వ్యాన్ అద్దాలను పగులగొట్టి అందులో ఉన్న టేప్ రికార్డ్‌ను చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకొని చెట్టుకు కట్టేసి చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. బీరయ్య పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

లింగంపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న కిరాణ దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఆకుల సాయిలు కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం దుకాణం తీసిందుకు రాగా తలుపులు విరిగి ఉన్నట్లు గుర్తించాడు. ఈ చోరీలో రూ. పదివేలు విలువ చేసే సిగరేట్లు, చిల్లర నగదును దుండగులు చోరీ చేశారన్నారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ల సీజ్

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా భూమిని చదును చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎఫ్ఆర్వో రవీందర్ మంగళవారం పేర్కొన్నారు. పట్టుకున్న వాటిలో రెండు ట్రాక్టర్లు కోనసముందర్‌కు చెందిన మక్కల చిన్నయ్యవి కాగా, మరో ట్రాక్టర్ కుప్కాల్‌కు చెందిన భూక్య గణేశ్‌గా విచారణలో గుర్తించామన్నారు. అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లతో అధికారులు

ఇప్పించిన అప్పు ఇవ్వడం లేదని ఆత్మహత్య

కామారెడ్డి రూరల్: అవసరం నిమిత్తం బయట అప్పు ఇప్పిస్తే తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వకుండా ఏం చేసుకుంటారో చేసుకొమ్మని బెదిరింపులకు పాల్పడటంతో అప్పు ఇప్పించిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాంధారి నరేశ్(40) కామారెడ్డికి చెందిన ఓ వ్యక్తికి తన సొంత డబ్బు ఇవ్వడంతో పాటు ఇతరుల వద్ద మొత్తం రూ.10 లక్షల అప్పు ఇప్పించాడు. కొద్దిరోజులుగా డబ్బుల గురించి అడిగితే రేపు మాపు అంటూ వాయిదాలు పెడుతూ వస్తున్నాడు. రెండురోజుల క్రితం డబ్బులు ఖచ్చితంగా కావాలని గట్టిగా అడిగితే డబ్బులు లేవని, ఏం చేసుకుంటావో చేసుకొమ్మని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తన సొంత డబ్బుతో పాటు ఇప్పించిన డబ్బులు వస్తాయో రావో అని మనస్తాపం చెంది ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



నరేశ్(ఫైల్)